విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక








సంపుటి: 16 | సంచిక : 70 | శుక్రవారం 3. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## 14,115 కోట్లతో మెగా హైవే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్!



- ప్రధాని మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ
- భారీ రహదారుల ప్రాజెక్టులకు ఆమోదం

4

## బాలికపై 30మంది అఘాయిత్యం

- బలవంతంగా మద్యం తాగించి దారుణం
- నిందితుల 4 హోటళ్లపై బుల్డోజర్ యాక్షన్
- ఇప్పటివరకు పన్నెండు మంది అరెస్ట్

4

రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో 13 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక లైంగికదాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో బాధిత బాలికపై ఐదు రోజుల పాటు 30 మందికి పైగా వ్యక్తులు పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఘటనపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్‌కు దిగింది.





## కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ డుమ్మా

హైదరాబాద్ తెలంగాణ వాణి)

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కీలక మంత్రిమండలి సమావేశానికి ఆమె రాకపోవడంపై సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. నిన్ననే సురేఖ తన విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ, ఈ రోజు జరిగిన కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉండి ఉంటాయని అంతా భావిస్తున్నారు. ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి కొండా సురేఖ అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటు విషయంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది.




# రాష్ట్రంలో 'వీబీజీ రామ్‌జీ' పథకం అమలు..

- మూసీ ప్రాజెక్టు ఫేజ్-1కు ఆమోదం
- ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బందికీ ఉచితంగా అల్పాహారం
- 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్'కు ఆమోదం..
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల భర్తీకి ఆమోదం

హైదరాబాద్ తెలంగాణ వాణి)

తెలంగాణ సచివాలయం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన దాదాపు 3 గంటల పాటు కొనసాగిన 'ఈ కేబినెట్' భేటీ ముగిసింది. ఈ సమావేశంలో ప్రధానంగా విద్యాశాఖ, సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలకమైన అంశాలపై మంత్రి మండలి విస్తృతంగా చర్చించి, కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముందుగా విద్యా రంగానికి సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఇకపై విద్యార్థులతో పాటు విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, లెక్చరర్లు, బోధనేతర (నాన్-టీచింగ్) సిబ్బంది అందరికీ కూడా ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

ఇక కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వీబీజీ రామ్‌జీ' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే, ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కొన్ని అభ్యంతరాలపై దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఆశ్రయించాలని, దీనిపై న్యాయ పోరాటం చేయాలని కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది.

## అవినీతి జరిగింది కాబట్టే మమ్మల్ని చర్చకు వెళ్లకుండా అడ్డుకున్నారు

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు
- 'ప్రభుత్వ, గురుకుల పాఠశాల టెండర్లలో అవినీతి జరిగింది.

హైదరాబాద్ తెలంగాణ వాణి)

తమను చర్చకు రమ్మంటారని.. వస్తే అరెస్టు చేస్తారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు వస్తానని ఎందుకు రాలేదని ప్రశ్నించారు. "ప్రభుత్వ, గురుకుల పాఠశాల టెండర్లలో అవినీతి జరిగింది. దీనిపై చర్చకు రావాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆహ్వానించారు. హరీశ్‌రావుతోనే చర్చిస్తామని అన్నారు.. నా షెడ్యూల్ రద్దు చేసుకుని వచ్చాను. చర్చకు వస్తుంటే పోలీసులతో నన్ను ఎందుకు అడ్డుకున్నారు? మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌కు ఫోన్ చేశాను.. ఎవరూ ఫోన్ ఎత్తలేదు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా లేదు.. తోక ముడిచింది. టెండర్లలో అవినీతి జరిగింది కాబట్టే చర్చకు భయపడుతున్నారు. మంత్రి జూపల్లి తక్షణమే రాజీనామా చేయాలి. ఆయన నిన్నటి వరకూ రూ.8లక్షల కోట్ల అప్పు అన్నారు. ఇవాళ రూ.7లక్షల కోట్లు అంటున్నారు. జూపల్లి చర్చకు వస్తే రూ.3లక్షల కోట్ల అప్పు అని అంగీకరించేవారు. ఈ అంశంపై ఆయన వద్ద సరైన సమాచారం లేదు. సవాల్‌ను స్వీకరించి జూపల్లి తోక ముడిచారు. హామీలు అమలు చేయమంటే మాపై నెపం నెట్టి తప్పించుకుంటున్నారు"అని హరీశ్‌రావు అన్నారు.




## హైడ్రా పేదల ఇళ్లనే కూలుస్తోంది తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్: నగరంలోని తార్నాకలో ఎర్రకుంట ఆక్రమణపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై వాదనల సందర్భంగా.. 8 ఎకరాల చెరువు ఆక్రమణకు గురైందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ తెలిపారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, లేక్ ప్రొటెక్షన్ కమిటీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఈక్రమంలో ఆయా విభాగాల అధికారులపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. హైడ్రా, జీహెచ్ఎంసీ కేవలం పేదల ఇళ్లనే కూలుస్తున్నాయని వ్యాఖ్యానించింది. వాటికి నోటీసులు జారీ చేసి.. తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది.

## ఓఆర్ఆర్‌పై కాల్పులు

- పోలీసులపై క్రిమినల్ దాడి
- పోలీసుల ఎదురుకాల్పులు
- శ్రీకాంత్ కాలికి తగిలిన బుల్లెట్లు
- హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



3

## ఎజెండా మారాలి!

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మూసీకి లక్ష కోట్లు ఎలా
- అధికారంలోకి వస్తే ఉచిత విద్య
- రేవంత్ పాలనపై కవిత ఫైర్



2

## రైతుల పేరిట డ్రామాలు!

- దృష్టి మరల్చేందుకే కొత్త ఎత్తుగడలు
- వైఫల్యాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు



## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



## రైతులను బెదిరించి డబ్బులు వసూలు

ఫిర్యాదుతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్

3



## రూ.3 కోట్ల లంచం కేసు

ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లోవత్ 3 కోట్ల రూపాయల లంచం కేసులో సీబీఐ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. కేసు వివరాలను అధికారులు బుధవారం మీడియాకు వెల్లడించారు.

4

## రోడ్డు ప్రమాదంలో తల్లి కోతి మృతి

- శవాన్ని హత్తుకుని పసికూన రోదన
- హృదయాలను కదిలించిన ఘటన

రాజన్న సిరిసిల్ల, జూలై 2 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామ బస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తల్లి కోతి మృతి చెందింది. తల్లి మృతి చెందిన విషయం తెలియని పసికూన కోతి ఆమె శరీరాన్ని హత్తుకుని విడిచిపెట్టకుండా ఉండడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. తల్లి ఒడిలోనే భద్రత ఉందనే అమాయక నమ్మకంతో పసికూన తల్లి శవాన్ని ఆనుకుని ఉండిపోయిన దృశ్యం హృదయ విదారకంగా మారింది. ఈ ఘటనను చూసిన స్థానికులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తల్లి--బిడ్డల అనుబంధానికి నిదర్శనంగా నిలిచిన ఈ దృశ్యానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## శాతవాహన యూజీ VI & IV సెమిస్టర్ ఫలితాలు విడుదల



**కరీంనగర్, జులై 02 (తెలంగాణ వాణి):**
శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2026లో నిర్వహించిన యూజీ (=19) ఆరో, నాలుగో, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారులు విడుదల చేశారు.
ఆరో సెమిస్టర్: బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల నుంచి 9,361 మంది హాజరుకాగా 4,721 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత 50 శాతంగా నమోదైంది. వీరిలో 2,135 మంది డిస్టింక్షన్, 2,580 మంది ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారు. కోర్సుల వారీగా బీబీఏ 65 శాతంతో ముందంజలో నిలిచింది.
నాలుగో సెమిస్టర్: 7,902 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3,536 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,352 మంది తదుపరి సెమిస్టర్‌కు ప్రమోట్ అయ్యారు. మొత్తం ఉత్తీర్ణత 45 శాతంగా నమోదైంది. ఈ సెమిస్టర్‌లో కూడా బీబీఏ 58 శాతంతో అగ్రస్థానంలో ఉంది.
రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు అర్హులైన విద్యార్థులు 12.07.2026 లోగా తమ కాలేజీల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. జవాబు పత్రాల జెరాక్స్ కాపీల కోసం 15.07.2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫలితాలు, మార్కుల వివరాలు శాతవాహన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ »»www.satavahana.ac.inµµ (http://www.satavahana.ac.in) లో అందుబాటులో ఉన్నాయని పరీక్షల నియంత్రణాధికారి డా. డి. సురేష్ కుమార్ తెలిపారు.

## బ్రేకియల్ ప్లెక్సస్ గాయాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**సరైన సమయంలో చికిత్స తీసుకుంటే చేయి పనితీరు పునరుద్ధరించే అవకాశం**

**డాక్టర్ పి.ప్రకాష్**




**కరీంనగర్:జులై 02 (తెలంగాణ వాణి)**
చేతికి సంబంధించిన ప్రధాన నరాలు దెబ్బతినే బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజరీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా యశోద హాస్పిటల్,హైటెక్ సిటీ, హైదరాబాద్‌కు చెందిన ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్, బ్రేకియల్ ప్లెక్సస్ సర్జన్ డాక్టర్ పి.ప్రకాష్ మాట్లాడుతూ ఈ గాయాలు ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు,ముఖ్యంగా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువగా సంభవిస్తాయని తెలిపారు.యువతలో, ముఖ్యంగా బైక్ నడిపే వారిలో ఈ సమస్య అధికంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. బ్రేకియల్ ప్లెక్సస్ నరాలు దెబ్బతింటే చేతి కదలికలు తగ్గిపోవడం,స్పర్శ కోల్పోవడం,భుజం లేదా మోచేయి పనిచేయకపోవడం, తీవ్రమైన సందర్భాల్లో మొత్తం చేయి పనిచేయకుండా పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నప్పటికీ చాలామంది సరైన వైద్యుడిని సంప్రదించకుండా ఆలస్యం చేయడం లేదా ఫిజియోథెరపీతోనే సరిపెట్టుకోవడం వల్ల చికిత్స ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండవని చెప్పారు.గాయం అయిన వెంటనే బ్రేకియల్ ప్లెక్సస్ నిపుణుడిని సంప్రదిస్తే నరాల మరమ్మతు,నరాల మార్పిడి, కండరాల మార్పిడి లేదా టెండన్ ట్రాన్స్‌ఫర్ వంటి శస్త్రచికిత్సల ద్వారా చేయి పనితీరును గణనీయంగా పునరుద్ధరించే అవకాశం ఉంటుందని తెలిపారు. బ్రేకియల్ ప్లెక్సస్ గాయాలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, గాయమైన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని డాక్టర్ పి.ప్రకాష్ సూచించారు.ఈ అవగాహన సదస్సులో వైద్యులు,వైద్య విద్యార్థులు, ప్రజలు పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**



**కొత్తగూడెం, జులై 02 (తెలంగాణ వాణి)**
భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.తనిఖీలో భాగంగా కలెక్టర్ డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి వారి హాజరు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. ఆసుపత్రి సిబ్బంది ఎన్ని షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ వార్డులను పరిశీలించి, ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న మహిళల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు సేకరించారు. మూడు షిఫ్టుల్లో రోగులకు సేవలు అందిస్తున్నట్లు వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది స్పందనపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట హాస్పటల్ సూపరింటెండెంట్ ఎం. రాధా మోహన్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ సీతారాం, ఆర్ఎంఓ చైతన్య, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముసుగుల తొలగింపుపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

- **రసమయి చర్య సిగ్గు చేటు**
- **చర్యకు కాంగ్రెస్ డిమాండ్**

**తిమ్మాపూర్:జులై 02 (తెలంగాణ వాణి విలేకరి)**
తిమ్మాపూర్ ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన మహనీయుల విగ్రహాలకు వేసిన ముసుగులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాల కిషన్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తొలగించిన దుకు నిరసనగా గురువారం కాంగ్రెస్ పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగింపునకు బాధ్యుడైన రసమయితో పాటు అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరిమి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్ఎండీ సీఐ రమేశ్ కు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణం లో ప్రతిష్ఠించిన మహనీయుల విగ్రహాలకు ఆర్టీసీ యాజమా న్యం నుంచి ఎలాంటి అనుమ తులు లేనందున ఆ విగ్రహా లను ఆవిష్కరించకుండా ముసుగులు వేసి ఉంచారు. అయితే రసమయి బాలకిషన్ తన అనుయాయులు,ఆ పార్టీ నాయకలతో కలిసి విగ్రహాల కు వేసిన ముసుగులను తొలగించారు.ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముసుగులు తొలగించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఇది ముమ్మాటికీ నిబంధనల ఉల్లంఘనేనని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మహనీయుల విగ్రహాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సరి కాదని,మాజీ



ఎమ్మెల్యే అయి నంత మాత్రాన చట్టాన్ని చేతిలోకి తీసుకుంటారా?" అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు ప్రశ్నించారు.
మహనీయుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించిన రసమయి బాలకిషన్‌పై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని,లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తాం"అని నాయకులు హెచ్చరించారు.సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ ఆందోళనతో బస్ స్టాండ్ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.పోలీసులు పరిస్థి తిని అదుపులోకి తీసుకొచ్చా రు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరిమి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దళితులను మోసం చేసిన రసమయి బాలకిషన్ దొంగచాటుగా మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఛీత్కారానికి గురైన రాజకీయ నిరుద్యోగిగా మిగిలిన బాలకిషన్ ఇప్పుడు విగ్రహాల పేరిట రాజకీయం చేయాలని చూస్తున్నరని ఆయన ఎద్దేవా చేశారు. మహనీయుల విగ్రహాలకు ఈ పరిస్థితి రావడానికి రసమయి కారణమని,గత బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ అనుమతి పొందకుండానే విగ్రహాలు పెట్టినప్పుడు అనుమతి పొందాలనే సోయి ఎందుకు లేకుండా పోయిందని ఆయన ఘాటుగ విమర్శించారు. అనుమతి పొందకపోవడం రసమయి వైఫల్యం కాదా అని సూటిగా ప్రశ్నించారు.మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోటి రూపాయల సుదా నిధులో మహనీయుల విగ్రహ స్థలంలో సుందరీకరణ పను లు చేపట్టి త్వరలో కనీవినీ ఎరుగని రీతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్,బాబూ జగ్జీవన్ రాం విగ్రహాలను ఆవిష్కరించే సన్నాహాల్లో ఉండగా,దొంగ చాటుగా వచ్చి రసమయి ముసుగులు తొలగించారని అరుణ్ కుమార్ ధ్వజమెత్తా రు.ఇది రాజకీయ అక్కసు తోనే రసమయి ఈ చర్యకు పాల్పడినట్టు ఆయన చెప్పారు.మహనీయుల ప్రతిష్ఠను,గౌరవాన్ని పెంచే రీతిలో విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తా మన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్,దళిత నాయకులు అలువాల కోటి, మాతంగి అనిల్,రెడ్డి,గాని రాజు,మామిడి అనిల్ కుమార్,మేడి అంజయ్య, కృష్ణబాబు ,ఉప్పులేటి రాజు, కనుకం అశోక్, కనుకం కుమార్, చెన్నబోయిన రవి, పెరుక రవీందర్,అసోద శ్రీనివాస్ ,వంశీ, నగునూరి శ్రీనివాస్,తిమ్మాపూర్, మానకొండూర్,గన్నేరువరం మండలాల పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బొడ్డు సునిల్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి,పెంచాల కిషన్ రావు, ముస్కు ఉపేందర్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, రాజేశ్వరి, బందెల మహేందర్, పెరుక రవీందర్,రాములు యాదవ్,మీస సత్యనారా యణ,రామకృష్ణ,బొట్ల కిషన్, గొల్లెన కొమురయ్య, తమిశెట్టి రాజేశ్,రమేశ్,చంద్రాకర్, బాపురావు,అజయ్ తోపాటు వివిధ గ్రామాల నుంచి కార్యక ర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దర్శనం గంగాధర్ అంతిమ యాత్రలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

**రుద్రంగి, జులై 02 (తెలంగాణ వాణి)**
బహుజన్ సమాజ్ పార్టీ సీనియర్ నాయకుడు సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి దర్శనం గంగాధర్ అనారో గ్యంతో మరణించగా గురువా రం మధ్యహ్నం రుద్రంగిలో జరిగిన అంతిమ యాత్రలో బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం స్థానిక నాయకులతో కలిసి గంగాధర్ అంతిమయాత్రలో పాల్గొని ఆయన పార్థివదేహా నికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు.అనంత రం గ్రామ వీధుల్లో జరిగిన అంతిమయాత్రలో పార్టీ నాయకులు ఆయనపై పాటలు పాడటంతో గ్రామ స్థులు పార్టీ కార్యకర్తలు కన్నీటి పర్యంత మయ్యారు. నిషాని రామచంద్రం,ఎనగం దుల వెంకన్నమేకల మునీందర్‌లు గంగాధర్ పాడే మోసారు.ఉమ్మడి జిల్లా నుండి నాయకులు కార్యక ర్తలు గంగాధర్ చివరి చూపు కోసం భారీగా తరలి వచ్చారు.పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు వారికి ధైర్యం చెప్పారు.అనంతరం రామచంద్రం



మాట్లాడుతూ గంగాధర్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ముప్పై సంవత్సరాలుగా ఏ పార్టీ లోకి వెళ్లకుండా పూలే అంబేద్కర్ సిద్దాంతాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని అన్నారు.ఒక పక్క దొరల నియంతృత్వం కొనసా గుతుందని ఈ ప్రాంతంలో యువకులు మావోయిజం వైపు పోతుంటే సామాజిక పరివర్తన కోసం అంబేద్కరి జమే సరైనదని అందుకు బీఎస్పీ ఒక్కటే బహుజనుల మీద జరుగుతున్న వివక్ష దోపిడి దాడుల నుండి కాపా డుతుందని వివరించి ఎంతో మందిని బీఎస్పీ వైపు ఆలోచింప చేశారని గుర్తు చేశారు.బట్టు రామచంద్రం గజ్జేల అశోక్ లు పాడిన పాటలకు ప్రజలు కన్నీటి పర్యంతమ య్యారు. అనంతరం ఆయన సంస్మరణ సభ కోసం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం కోసం పార్టీ నాయకులు విరాళాలు అందించారు. ఉన్నారు.అంతిమ యాత్రలో సీనియర్ నాయకులు మేకల మునీందర్,స్వామి గౌడ్, రమేష్ చంద్ర నాయక్ దొబ్బల నరేష్ లు నాయకులు బీఎస్పీ స్థానిక నాయకులు దయ్యాల ఉదయ్, కట్కూరి శంకర్ కాదాసు మహేందర్ తదిత రులు పాల్గొన్నారు.

# కళాశాలల బంద్ విజయవంతం

**బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్**

**కరీంనగర్ జులై 02 (తెలంగాణ వాణి)**
బీసీ విద్యార్థి సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ అధ్యక్షతన కరీంనగర్ లో గురువారం బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కళాశాలల బంద్ కు పిలుపు ఇవ్వడం జరిగింది.కరీంనగర్ లోని కళాశాలల బంద్ కార్యక్ర మంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ మాట్లాడుతూ. రాష్ట్రంలో వేలాది మంది బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు.ఫీజు రియంబర్స్మెంట్ ఎత్తి వేయాలని చూస్తే రాష్ట్రం అగ్ని గుండంగా మారుతుం దని విద్యార్థుల జీవితాలు ఆగం చేయొద్దని హెచ్చరిం చారు,బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ మాట్లాడుతూ అయితే గత విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబ ర్స్‌మెంట్ బకాయిలు



దాదాపు 10000 వేల కోట్ల రూపాయ లు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు .అనేక కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయడం,తదుపరి విద్య మరియు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడు తున్నా యని అప్పుడు ఇస్తాం ఇప్పుడు ఇస్తాం అని కాలయాపన చేస్తున్నారే తప్ప బకాయిలు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ మాట్లాడుతూ బీసీ సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి మూడవ పట్టణ పోలీస్ స్టేషనుకు తరలించారని అరెస్ట్ లతో ఉద్యమం ఆగదని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కళాశాల బంద్ ద్వారా నిరసన తెలియజేస్తూ విద్యార్థుల భవిష్యత్తును కాపాడేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేయాలని బీసీ సంఘాల పక్షాన డిమాండ్ చేస్తున్నాం,ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అనుబంధ నాయకులు రంగు సంపత్, దొగ్గలి శ్రీధర్,రాచమల్ల రాజు,మంతెన కిరణ్,దొంపటీ మురళి ,బ్రమ్మచారి,మాదాసు సంజీవ్,బియ్యాని తిరుపతి, బోయిని ప్రశాంత్, గాజే ప్రజ్యోత్,సంతోషిని,అజయ్,ఆదర్శ్,రాజా శేఖర్, సతీష్, శ్రీకాంత్,వెంకటస్వామి తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు,

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొన్నం ప్రభాకర్

కార్వాన్ : రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం జాంబాగ్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మొహమ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు రాజా సింగ్, నవీన్ యాదవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 184 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలతో పాటు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, టెండర్ ప్రక్రియ అనంతరం దశలవారీగా పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. లబ్ధిదారులు ఉపాధికి దూరం కాకుండా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి గృహాలను నిర్మిస్తామని తెలిపారు. పైలట్ ప్రాతిపదికన కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందజేస్తామని వెల్లడించారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లో కొత్త ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నామని, లబ్ధిదారులు జీవనోపాధికి సమీపంలోనే గృహాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధూల్‌పేట్ ప్రాంతంలోని సంప్రదాయ విగ్రహ తయారీదారుల జీవనోపాధికి అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులను




ఆదేశించినట్లు చెప్పారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మొహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ సొంతింటి పట్టా, ఇంటి తాళాలు అందుకోవడం ప్రతి కుటుంబానికి ఒక కల అని పేర్కొంటూ, లబ్ధిదారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పాతబస్తీ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ రెండు పడకగదుల ఇల్లు అందించి పేదల కలను సాకారం చేయడంలో ప్రభుత్వం సహకరించిందని, ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ (హౌసింగ్) అశోక్ చక్రవర్తి, నాంపల్లి తహసీల్దార్ నయీమ్ ఉద్దీన్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, గృహనిర్మాణ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్మాల శంకర్ మరణం కళారంగానికి తీరని లోటు

### టీవీ, రేడియో జానపద గాయకుడు గడిపె మల్లేశ్



**హుస్నాబాద్, జూలై 2 (తెలంగాణ వాణి ఆర్‌సి)**
అభ్యుదయ కవి, జానపద గేయ రచయిత కర్మాల శంకర్ ఆకస్మిక మరణం కళారంగానికి తీరని లోటని టీవీ, రేడియో జానపద గాయకుడు గడిపె మల్లేశ్ అన్నారు. చిన్న వయస్సు నుంచే పాటలపై మక్కువ పెంచుకున్న శంకర్, తాను రచించిన గేయాలను పల్లెల్లో, పొలాల్లో ఆలపిస్తూ జానపద కళకు విశేష సేవలు అందించారని తెలిపారు. తన ప్రతిభతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన శంకర్, అభ్యుదయ భావజాలంతో ఎన్నో పాటలు రచించి ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఛాతినొప్పి రావడంతో ఆయనను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నకేరకొమ్ముల గ్రామంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన గడిపె మల్లేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొని, వెల్పుల శ్రీనివాస్‌తో కలిసి జానపద గేయాల ద్వారా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గడిపె మల్లేశ్ మాట్లాడుతూ, కర్మాల శంకర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కర్మాల శంకర్ మృతిపట్ల హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు వరుకొలు కళాచందర్, గజ్జెల కనకయ్య, వేముగంటి స్వామి, పిట్టల తిరుపతి, వడ్డేపల్లి మల్లేశం, నన్నే అజయ్ కుమార్, పార్నంది రవీందర్, బత్తుల చంద్రమౌళి, గడిపె రవీందర్, మేరె కనకచంద్ర, వొద్దిరాల బాలయ్య, గడిపె చిన్నబాలు, తిప్పర్తి శ్రీనివాసులు, డాక్టర్ తైదల అంజయ్య,, గడ్డం కనకయ్య, రేవోజు సంపత్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, శంకర్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## పదవీ విరమణ పొందిన ఇంటలిజెన్స్ ఎస్సై కి సన్మానం



**ధర్మారం, జులై 2 (తెలంగాణ వాణి )**
ధర్మారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో 1986నుండి 91వరకు కానిస్టేబుల్ గా పనిచేసిన ఆకుతోట వెంకన్న పదవి విరమణ సందర్భంగా ఆయనను ధర్మారం మండల కేంద్రంలో మాజీ వివిఎస్ఎస్ చైర్మన్ దేవి జనార్ధన్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి దేవి రాజలిలింగు, ద్యాగెటి కొంరయ్య ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం పదవి విరమణ పొందిన వెంకన్న మాట్లాడుతూ గతంలో తాను ధర్మారం పోలీస్ స్టేషన్ లో ఐదున్నర సంవత్సరాలుగా పనిచేసిన అనుభూతిని పంచుకున్నారు. 45 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. జగిత్యాల జిల్లాలోని వీర్నపల్లి ఎస్సైగా, జిల్లా హెడ్ క్వార్టర్ ఇంటెలిజెన్స్ ఎస్ఐగా పని చేసి పదవి విరమణ పొందాలని తాను ధర్మారంలో పనిచేసిన అనుభూతిని మరువలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార సురేందర్, వన్నెల బాలిరెడ్డి, బొల్లం మల్లేశం, బిజెపి నాయకులు కర్రె లక్ష్మణ్, కొత్తపల్లి స్వామి, గుమ్మడి లచ్చయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కూలిన డ్రైనేజీతో ఇంటికి పొంచి ఉన్న ప్రమాదం

**ధర్మారం, జులై 02 (తెలంగాణ వాణి )**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో మెయిన్ రోడ్ అనుకోని ఉన్న డ్రైనేజి ఇటీవల కురిసిన భారీ వర్షానికి నాలుగు మీటర్ల మేర కూలిపోయి ప్రమాదకరంగా మారింది. దానికి సమీపంలో గజం దూరం లో ఉన్న తన రేకుల షెడ్డు గోడ డ్రైనేజి నీటి తాకిడికి సొరగొట్టి కూలే అవకాశం ఉందని పానుగంటి చంద్రమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. కొద్ది రోజుల క్రితం గ్రామపంచాయతీకి సమాచారం ఇచ్చినా ఇంతవరకు పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తాను నిరుపేద ఒంటరి మహిళను ఇంటి గోడ కూలితే తిరిగి నిర్మించుకునే స్థితిలో లేనని ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కూలిన డ్రైనేజిని పునం నిర్మించాలని చంద్రమ్మ వేడుకుంది.



## కుర్మపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాసము

**రాయికల్: జూలై 02 (తెలంగాణ వాణి):**



రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామంలో ఒకటవ తరగతి లో చేరిన పిల్లలకు అక్షర అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ కుర్మపల్లి గ్రామ సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ఏఏపిసి చైర్మన్,సభ్యులు,గ్రామస్థులు, ఉపాధ్యాయులు అందరు కలిసి దాదాపు 30 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేయడానికి చేసిన కృషి చాలా అభినందనీయమని పేర్కొన్నారు,ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు,మెరుగైన విద్య బోధన ఉంటుందని అన్నారు.గ్రామ సర్పంచ్ మ్యాకల మల్లేశం 30 మంది పిల్లలకి పలకలు,నోట్ బుక్స్,పెన్సిల్ ప్యాకెట్స్, రబ్బర్లు,చాక్ మర్,బలపాల ప్యాకెట్స్ ఇచ్చినందుకు సర్పంచ్ ను ఘనంగా సన్మానించారు.బడి అన్ని రకాల అభివృద్ధి లో ముందు ఉంటానని మ్యాకల మల్లేశం సర్పంచ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎలిగట్టటి రాజకిశోర్ అల్లీపూర్, తాట్లవాయ సముదాయ ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్, బోగ రమేష్,ఏఏపిసి చైర్మన్ దయ్యాల కొమురవ్వ,జే.రాజేందర్,వోడ్నాల ప్రియాంక,పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, పిల్లల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక జ్ఞానానికి సామాజిక కోణాన్ని జోడించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

- సోన్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్

**నిర్మల్, జూలై 02(తెలంగాణ వాణి ప్రతినిధి)**
కేవలం పుస్తకాల్లోని పాఠాలను నేర్చుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సమాజంలో జరుగుతున్న పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విద్యార్థులకు సూచించారు. గురువారం సోన్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన, వసతి, ఆహారం, పరిశుభ్రత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ముందుగా పాఠశాలలోని తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. అనంతరం వంటశాల, సరుకుల నిల్వ గది, భోజనశాలను తనిఖీ చేసి అక్కడి పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు. మెస్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నాణ్యమైన కూరగాయలు, ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని,



వంటశాలలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు, స్టాక్ రిజిస్టర్‌ను క్రమం తప్పకుండా నవీకరించాలని సూచించారు.అనంతరం పదో తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి జవాబు పత్రాలను పరిశీలించి, గణితం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. కొంతమంది విద్యార్థులను బోర్డుపై లెక్కలు చేయించి, సమస్యల పరిష్కార విధానాన్ని వివరింపజేశారు. శాస్త్రవేత్తల కృషి, విజ్ఞాన శాస్త్రం సమాజ అభివృద్ధిలో పోషిస్తున్న పాత్ర గురించి వివరించి, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమకాలీన సామాజిక, శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులు ప్రశ్నలు అడిగే అలవాటు పెంపొందించుకోవాలని, ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడం, పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని కలెక్టర్ సూచించారు. సృజనాత్మకత, ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని తెలిపారు.పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, వసతి, భోజన సదుపాయాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ప్రత్యేక అధికారి సుధాకర్, తహసీల్దార్ సంతోష్, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ‘ఆరోగ్య పాఠశాల’ లక్ష్యం - జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**ఆదిలాబాద్, జులై :02 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా ‘ఆరోగ్య పాఠశాల’ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం బజార్హత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల లో నిర్వహించిన మూడవ విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, విద్యార్థులు ఆరోగ్య పాఠశాల లోని అంశాలపై పాటలు, నృత్యం, నాటిక రూపంలో అవగాహన కల్పించారు. సంబంధిత అధికారులు ఆరోగ్య పాఠశాల లోని ఆరు అంశాలపైన వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, కాలానుగుణ వ్యాధుల నివారణ, వ్యక్తిత్వ వికాసం పై వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా ‘ఆరోగ్య పాఠశాల’ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. గత రెండేళ్లుగా జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతుందని, దీనికిగాను గతంలో జిల్లాకు అవార్డు లభించిందని గుర్తుచేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల రక్షణకై ‘పాక్సో చట్టం’పై ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు, ‘పాక్సో క్యాలెండర్’ ను విడుదల చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే రకరకాల సమస్యలను నిర్భయంగా, గోప్యంగా



చెప్పుకునేందుకు పాఠశాలల్లో ‘ఫిర్యాదుల పెట్టెలను’ ఏర్పాటు చేస్తున్నామని, వీటిని ప్రతి నెల ఒకటో తేదీన ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో తెరిచి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలమూత్ర విసర్జన వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తమ సొంత ఖర్చులతో ఇంట్లోనే మరుగుదొడ్లు నిర్మించుకుని వాడాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను పెంచేందుకు దేశ ప్రముఖుల జీవిత చరిత్రలను ఇంగ్లీష్ పీరియడ్లలో విద్యార్థుల చేత చదివించాలని, అలాగే ‘ఖాన్ అకాడమీ’ ద్వారా గణితం, సైన్స్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. ఈసారి జిల్లా నుండి ట్రిపుల్ ఐటీ బాసరాకు రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బోథ్ శాసన సభ్యులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు చదువుతో పాటు మంచి ఆరోగ్యం అత్యంత కీలకమని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో అడ్మిషన్ల డిమాండ్ ఎంతో పెరుగుతోందని, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య పాఠశాల, విద్యా క్యాలెండర్ మరెక్కడా లేదని, వారి సమర్థవంతమైన పనితీరు వల్ల అదిలాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో పలు అవార్డులు దక్కాయని కొనియాడారు. తల్లిదండ్రులు పిల్లను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా మోడల్ స్కూల్ ఆవరణలో సీసీ రోడ్డు, బోర్‌వెల్ సదుపాయాన్ని త్వరలోనే కల్పిస్తామన్నారు. అలాగే గతంలో ఇబ్బంది పడిన కొత్తపల్లి గ్రామానికి సుమారు రూ. 1 కోటి నిధులతో బ్రిడ్జిని మంజూరు చేయించామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, అన్ని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో సొంతంగా మంచినీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థుల పట్ల జిల్లా కలెక్టర్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా శాఖ బలోపేతానికి కృషి చేస్తున్నారని, ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. విద్యార్థులు వ్యసనాలు, చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా చదువు పట్ల శ్రద్ధ వహించి, ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఫోక్సో చట్టం- 2012 క్యాలెండర్ ను కలెక్టర్, ఎమ్మెల్యే, చైర్మెన్ ఆవిష్కరించారు. అనంతరం పోషకాహార తోటను ప్రారంభించి, మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, ఏంఆర్వో శ్యామ్ సుందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, ఏంఈఓ రాంకిషన్, అకడమిక్ కో ఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, స్థానిక సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట నూతన తహసీల్దార్ గడ్డం సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**జమ్మికుంట, జులై 2, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గడ్డం సుధాకర్‌ను స్థానిక జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, జమ్మికుంట ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని జర్నలిస్టులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో జమ్మికుంట ప్రాంత అభివృద్ధి, రెవెన్యూ సేవల సత్వర అందుబాటు, భూ సమస్యల పరిష్కారం, ధరణి సంబంధిత అంశాలు, రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి పలు అంశాలపై చర్చ జరిగింది. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకమైన పాలన అందించేందుకు తాను కట్టుబడి ఉన్నానని తహసీల్దార్ గడ్డం సుధాకర్



పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని, కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. ముఖ్యంగా రైతులు, పేదలు, వృద్ధులు, ప్రభుత్వ సేవల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే రెవెన్యూ శాఖ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించే అధికారులకు ఎల్లప్పుడూ మీడియా సహకారం ఉంటుందని పేర్కొన్నారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి తమవంతు బాధ్యత నిర్వర్తిస్తున్నారని, ప్రజల ప్రయోజనాల కోసం అధికారులు, మీడియా పరస్పర సహకారంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సమావేశంలో అభిప్రాయప డినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్, ఎంఎ రషీద్, దాట్ల శ్రీనివాస్, కొంగల కుమార్, జి. అఖిల్ వంశీ, తిప్పారపు రవీ, కుమార్ తదితర జర్నలిస్టులు పాల్గొని నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల: జులై 02 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెల్లడించారు. జగిత్యాల మోతే రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై స్పందించారు. గత ఎనిమిది నెలలుగా కేంద్రీయ విద్యాలయం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, కొంత ఆలస్యం జరిగినా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటోందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో వాలాంతరి సంస్థకు భూమి కేటాయింపులో కూడా ఆలస్యం జరిగిందని, ఆ విషయం అధికారులకు, మీడియాకు తెలిసిందేనని పేర్కొన్నారు. వాలాంతరి ఒక స్వయంప్రతిపత్తి (అటానమస్) సంస్థ అని, సహజ వ్యవసాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించడంతో భూమి కేటాయింపు అంశంలో కొంత సమయం పట్టిందన్నారు. అక్కడ శాస్త్రవేత్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయంతో పాటు



ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కూడా భూమి కేటాయించినట్లు తెలిపారు.కేవీకి స్థలం కేటాయింపుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం అవసరమని, ఈరోజు క్యాబినెట్‌లో ఈ అంశానికి ఆమోదం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవీ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్, కరీంనగర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కలిసి పాత ఎస్పీ కార్యాలయ భవనంలో తాత్కాలికంగా పాఠశాల నిర్వహణకు ఆమోదం తెలిపారని చెప్పారు.చల్ గల్ లో ఐదు ఎకరాల భూమికి కలెక్టర్ అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చారని, శాశ్వత కేటాయింపుకు క్యాబినెట్ అనుమతి అవసరమని వివరించారు. విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలని, తాను కేంద్రీయ విద్యాలయం కోసం చేసిన కృషికి అన్ని ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, చల్ గల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు 7 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు, మొత్తం రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేటాయించామని తెలిపారు.మంత్రి, ఎంపీతో కలిసి జగిత్యాల అభివృద్ధికి కృషి కొనసాగిస్తానని, వాలాంతరిలో వ్యవసాయ అభివృద్ధి కోసం కేంద్ర నిధులు తీసుకురావడంలో ఎంపీ సహకారం అవసరమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కో-ఆప్షన్ సభ్యులు గట్టు సతీశ్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, ముజీబ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, కొత్త మోహన్, అడువల లక్ష్మణ్, పిప్పరి అనిత, చాంద్ పాషా, రేపల్లె హరికృష్ణ, దుమల రాజ్‌కుమార్, బీరం రాజేశ్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ కు సిద్ధమవుతున్న రైతులు..

### నారు మళ్ళు సిద్ధం

**ధర్మారం, జులై 02( తెలంగాణ వాణి )**
ముందస్తు వర్షాలు నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ సీజన్ ధర్మారం మండలంలో ఊపందుకుంది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే నారు పోసేందుకు మళ్ళు సిద్ధం చేశారు. దీనికి తోడు ఇటీవల రైతు భరోసా నిధులు విడుదలవడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది ఖరీఫ్ సీజన్ కు ముందే వర్షాలు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి. దీంతో వేసవి దుక్కులు, సేద్యాలు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. గతంలో ఖరీఫ్ సిద్ధం వచ్చిందంటే కాడెద్దులు నాగళ్ళు సిద్ధం చేసుకునే రైతులు ప్రస్తుతం ట్రాక్టర్ల పై ఆధారపడి వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ లో వరి



తోపాటు కంది పంటలు వేసేందుకు రైతులు ఉత్సాహం చూపిస్తున్నారు. మిన్ను కురవాలి మన్ను పండాలని రైతులు వరుణున్ని వేడుకుంటున్నారు.

## మెదక్ జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు : కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, జూలై 2 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మెదక్ జిల్లా చరిత్రలో తొలిసారిగా రికార్డు స్థాయిలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 4.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, గతంతో పోలిస్తే 1.08 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా దిగుబడి నమోదైందన్నారు. 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, వారి ఖాతాల్లో రూ.1,005.66 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 8న ప్రారంభమైన కొనుగోళ్లు జూన్ 27తో పూర్తయ్యాయని, ఇందుకోసం జిల్లాలో 533 కొనుగోలు కేంద్రాలు (పీఏసీఎస్--305, ఐకేపీ--185, డీసీఎంఎస్--43) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జొన్న రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నాణ్యమైన జొన్నలను కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 3,609 మంది రైతుల నుంచి 6,347 మెట్రిక్ టన్నుల జొన్నలు సేకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సివిల్ సప్లై అధికారి పి. నిత్యానందం, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీపీఆర్‌వో రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలి:

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



**నిర్మల్, జూలై 02(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలో లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ పంటల విస్తీర్ణం పెంపుదలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నిర్దేశించిన 1600 ఎకరాలకు మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చొరవ చూపాలన్నారు. ఆ విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు మిగతా పంటలకు, ఆయిల్ పామ్ పంటలు పండిస్తే కలిగే ప్రయోజనాల మధ్య వ్యత్యాసాలను వివరించాలన్నారు. పెట్టుబడి, శ్రమ, సాగునీరు, రాబడి వంటి లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. హార్టికల్చర్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని వివరించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహిస్తుందని అన్నారు. మండలాల వారిగా వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు అంజిప్రసాద్, రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలి:

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



**నిర్మల్, జూలై 02(తెలంగాణ వాణి ప్రతినిధి)**
రేపటి దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం కలెక్టర్ దిశ కమిటీ సమావేశ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత ప్రజాప్రతినిధులందరికీ దిశ కమిటీ సమావేశానికి సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రతి అధికారి వారి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధి వివరాల నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. నివేదికలు పారదర్శకంగా ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పథకాల వివరాలను సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సర్పంచ్ ప్రత్యేక కృషితో ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య

**రాయికోడ్ :జులై 02(తెలంగాణ వాణి )**



రాయికోడ్ మండలంలోని సంగాపూర్ గ్రామంలో సర్పంచ్ ప్రత్యేక కృషి మరియు స్థానిక ప్రజల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో కేవలం 6 మంది మాత్రమే ఉన్న విద్యార్థులు, ప్రస్తుతం 43 మంది వరకు చేరడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నరసింహులు,సర్పంచ్ వెంకట్ రెడ్డి ,ఉపసర్పంచ్ సలాహుద్దీన్,అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్ పాల్గొన్నారు. వక్తలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థాయి నాయకత్వం,తల్లిదండ్రుల అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరగడం గ్రామ విద్యా అభివృద్ధికి మంచి సూచికగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో

# పరిశ్రమలకు వెన్నెముకగా ఐటీఐ విద్యార్థులు

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, జులై :02 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఆదిలాబాద్ పట్టణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో--2026 కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ముఖ్య అతిథిగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఇంజినీరింగ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, సీఎన్‌సీ మెషిన్ మెకానిక్, వర్చువల్ అనాలిసిస్ విభాగాలతో పాటు ఎలక్ట్రిషియన్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ , డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రఫీ తదితర ట్రేడ్లకు చెందిన ప్రాజెక్టులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకొని వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ



మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు వెన్నెముక వంటివని, ఆ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంలో ఐటీఐ కోర్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు 3డి టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టెక్నాలజీలు వంటి ఆధునిక అంశాల్లో నైపుణ్యం పెంపొందించుకొని దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి ప్రాజెక్టు వినూత్న ఆలోచనలతో, సాంకేతిక నైపుణ్యంతో రూపొందించబడిందని ప్రశంసిస్తూ, ఇలాంటి ప్రాజెక్టులు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, మావల సీఐ బి.డి. ప్రేమ్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, జులై : 02 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో ఫిజిక్స్ లెక్చరర్ల కు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం సిలబస్ పూర్తి చేయడం మాత్రమే కాకుండా, విద్యార్థులకు సబ్జెక్టులపై స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతులలో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని సూచించారు.



కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డి.ఐ.ఈ.ఓ ల దృష్టికి తీసుకువెళ్లి నివారించాలన్నారు. సైన్స్ సబ్జెక్టులలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలని, తరగతిలో వెనుకబడిన లేదా 'టీచర్ సపోర్టెడ్' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తొలుత సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమైనందున, ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా నెలవారీ సమీక్షలు, ఈ విద్యాసంవత్సరంలో 3 లేదా 4 కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, జిల్లా అకడమిక్ కమిటీ సభ్యులు సూరజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమాకాంత్, తిరుపతి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఇతర జూనియర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలకు అక్రమ విద్యుత్ తీగలు అమర్చడం నేరం

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్సై జి. నరేష్**

**మందమర్రి, జూలై 2 (తెలంగాణ వాణి విలేకరి):**



పంటలను అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు పొలాల చుట్టూ అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుం టామని మందమర్రి ఎస్సై జి. నరేష్ హెచ్చరించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కొంతమంది రైతులు కోతులు, అడవి పందులు, నీలిగాయల నుంచి పంటలను కాపాడేందుకు నేరుగా విద్యుత్ లైన్ల నుంచి అక్రమ కనెక్షన్లు తీసుకుని తీగలు ఏర్పాటు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి చర్యలు మానవ ప్రాణాలతో పాటు పశువుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం కలిగిస్తాయని తెలిపారు. పొరపాటున ఆ తీగలను తాకిన రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అక్రమ విద్యుత్ తీగల కారణంగా ఎవరైనా మృతి చెందితే భూ యజమాని, అక్రమ కనెక్షన్ ఏర్పాటు చేసిన వ్యక్తిపై నేరపూరిత మానవహత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా పొలాల్లో తనిఖీలు నిర్వహిస్తారని, అక్రమ కనెక్షన్లు గుర్తిస్తే విద్యుత్ చట్టాల ప్రకారం భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తామని తెలిపారు. అడవి జంతువుల నుంచి పంటలను రక్షించుకోవడానికి ప్రభుత్వం అనుమతించిన సోలార్ ఫెన్సింగ్, నైలాన్ నెట్లు వంటి సురక్షితమైన ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అక్రమ విద్యుత్ కనెక్షన్ల గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే మందమర్రి పోలీస్ స్టేషన్ లేదా డయల్--100కు సమాచారం అందించాలని ఎస్సై జి. నరేష్ కోరారు.

# బాసర ఆలయ చోరీ కేసు ఛేదన

- 10 రోజుల్లోనే నిందితుల అరెస్టు.. వెండి కిరీటం స్వాధీనం
- వేగవంతమైన దర్యాప్తుతో నిర్మల్ పోలీసుల సక్సెస్

**నిర్మల్ - బాసర: జూలై 2 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఇటీవల జరిగిన చోరీ కేసును నిర్మల్ జిల్లా పోలీసులు కేవలం పది రోజుల్లోనే ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలతో పాటు దొంగిలించిన సొత్తును స్వీకరించిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 1.48 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..గత నెల జూన్ 22న గుంటూరు జిల్లాకు చెందిన పల్లపు ఏడుకొండలు,నిజామాబాద్ జిల్లాకు చెందిన గైని కిరణ్ అలియాస్ రామకృష్ణ ఆలయ ప్రహరీ గోడ దూకి లోనికి ప్రవేశించారు. గేటు తాళాలు పగులగొట్టి అమ్మవారి వెండి కిరీటం,హుండీని అపహరించారు. అనంతరం హుండీలోని సుమారు రూ.16 వేల నగదును తీసుకుని, వెండి కిరీటాన్ని రెండు ముక్కలుగా చేసి ఆలయం వెనుక వైపు నుంచి పరారయ్యారు. అనంతరం సాధారణ భక్తుల మాదిరిగా రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. నేరం జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు నాందేడ్,ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు




చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, విశ్వసనీయ సమాచారంతో దర్యాప్తు కొనసాగించి,వెండి కిరీటాన్ని విక్రయించేందుకు కాచిగూడ--నాగర్సోల్ రైలులో వెళ్తున్న ముగ్గురిని ఈ రోజు బాసర రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 1.220 కిలోల వెండి కిరీటం, 260 గ్రాముల వెండి పట్టీ,ఒక స్మార్ట్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రైల్వే సౌకర్యం ఉన్న ప్రాంతాల్లోని ఆలయాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించిన ముధోల్ సీఐ రవీందర్ నాయక్, బాసర సీఐ ఎస్.దీపక్, నిర్మల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్యతో పాటు దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అభినందించి రివార్డులు ప్రకటించారు.

# పంచాయతీ కార్యదర్శి విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం

**కార్యదర్శి సస్పెన్షన్ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి, జూలై-02 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జయ్యారం గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.డి. అమ్జద్ పాషాను సస్పెండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో శ్రీరాంపూర్ మండలం పందిల్ల గ్రామ పంచాయతీ, పెద్దపల్లి మండలం కాపులపల్లి గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహించిన సమయంలో సంబంధిత గ్రామపంచాయతీల రికార్డులను ఇప్పటివరకు అప్పగించకపోవడంతో పాటు విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు మండల పంచాయతీ అధికారులు నివేదించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయమై పలుమార్లు ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఫోన్ ద్వారా మూడు రోజుల గడువు ఇచ్చి పందిల్ల, కాపులపల్లి గ్రామపంచాయతీల పూర్తి రికార్డులను అప్పగించాలని ఆదేశించినప్పటికీ, సంబంధిత పంచాయతీ కార్యదర్శి స్పందించలేదని, ఎలాంటి వివరణ కూడా సమర్పించలేదని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ రికార్డులను అప్పగించకపోవడం, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం, విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి అంశాలపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ వెల్లడించారు.
అందుబాటులో ఉన్న నివేదికలు, సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం ఎస్.డి. అమ్జద్ పాషాను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శి ప్రధాన కార్యాలయంగా పాలకుర్తి మండలం జయ్యారం గ్రామపంచాయతీ నిర్ణయించినట్లు, జిల్లా పంచాయతీ అధికారి ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని వీడరాదని, నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ (జీవనభృతి) చెల్లించబడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సీఎంఆర్ డెలివరీ ప్రక్రియ వేగవంతం చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**మంచిర్యాల,జూలై 02 (తెలంగాణ వాణి):**
జిల్లాలోని రైస్ మిల్లర్లు 2025-26 రబీ సీజన్ సంబంధిత ధాన్యం సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ( రెవెన్యూ) ఛాంబర్ లో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి బ్రహ్మ రావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి రైస్ మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 ప్రస్తుత రబీ సీజన్ సంబంధిత సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని, 2024-25 రబీ, 2025-26 ఖరీఫ్ సీజన్ల సంబంధిత ధాన్యం సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ కార్యాచరణ రూపొందించాలని, మిషన్ కె 100 లో భాగంగా సిఎంఆర్ డెలివరీ ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 15 వ తేదీలోగా ధాన్యం వేలానికి సంబంధించిన బకాయిలను 100 శాతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి:జిల్లా కలెక్టర్



**మంచిర్యాల, జూలై 02 (తెలంగాణ వాణి):**
జిల్లాలో భూ సర్వే ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం భీమారం మండలం మద్దికల్ గ్రామంలో భూ సర్వే పనులను పరిశీలించిన ఆయన, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ భూముల హద్దులను నిర్ధారించడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భూములపై స్పష్టత వస్తుందని, అవసరమైన చోట ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద జరుగుతున్న నీటి ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించి, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కోసం పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 5వ తేదీ భువనగిరిలో జరిగే సమర భేరీ కార్యక్రమానికి ఆహ్వానం



**రాజపేట జూలై: 02(తెలంగాణ వాణి విలేఖరి)**
ఐదవ తేదీ భువనగిరిలో జరిగే తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమరభేరి కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులను రమ్మని తెలుపుతూ ఆహ్వాన పత్రికను తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి చంద్రశేఖర్, పాకాల నరసింహులు రంగారెడ్డి జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో రాజాపేట తెలంగాణ ఉద్యమకారుల మాజీ అధ్యక్షుడు మారోజు కుమారస్వామి మాజీ ఉపాధ్యక్షులు పెంట సత్యనారాయణ బెడిదే నర్సింహులు రాగీర్ బాలయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో బొడ్డుపల్లి చంద్రశేఖర్ యూత్ ప్రెసిడెంట్ తో తెలంగాణ ఉద్యమకారుల కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమర భేరీ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల కోసం మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిందిగా ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు హెల్త్ కార్డులు 250 గజాల జాగాను 25 వేల రూపాయల పెన్షన్ను ఇచ్చే విధంగా భువనగిరిలో జరిగే సమర భేరీ కార్యక్రమంలో ఉద్యోగం కారుల ప్రస్తావన మాట్లాడాలని కోరుతూ బొడ్డుపల్లి చంద్రశేఖర్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ కు రాజాపేట తెలంగాణ ఉద్యమకారుల మాజీ అధ్యక్షుడు మా రోజు కుమారస్వామి మాజీ ఉపాధ్యక్షుడు పెంట సత్యనారాయణ లు వినతి పత్రం అందజేశారు.

## అక్రమ ఇసుక రవాణా..ముగ్గురు అరెస్ట్.. ఎస్సై ఆవుల తిరుపతి హెచ్చరిక



**వీణవంక, జూలై 2, (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, వారిపై కేసు నమోదు చేశారు.ఎస్సై ఆవుల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం, పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీ నుంచి తెల్లవారుజామున అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందనే నమ్మదగిన సమాచారం అందడంతో దాడి నిర్వహించామన్నారు . తనిఖీల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, వాటి డ్రైవర్లు, యజమానులను అదుపులోకి తీసుకున్నామని, అరెస్టైన వారిలో పోతిరెడ్డిపల్లికి చెందిన పి. సాయికృష్ణ (25), నాగపూరి అరవింద్ (25), జీల పర్శరాములు ఉన్నారన్నారు . వీరి వద్ద నుంచి టి ఎస్ 02 ఇ వై 6313, టి ఎస్ 25 టీ 2958, టి ఎస్ 02 ఇ జి 7251 నంబర్ల వాహనాలతో పాటు నంబర్ లేని మహీంద్రా ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నామన్నారు .నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు . ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇ సందర్భంగా ఎస్సై ఆవుల తిరుపతి హెచ్చరించారు.

## అభివృద్ధి పనులు నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలి...

### అడిషనల్ కలెక్టర్ రాజగౌడ్



**రాయికల్:జూలై 02(తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న అమృత్ 2.0 అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) బి. రాజగౌడ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్,చిల్డ్రన్స్ పార్కును సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు.పార్కు అభివృద్ధి పనులు నిర్దేశిత వేగంతో కొనసాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, పనులు ఆలస్యం చేసిన సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో,నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం రాయికల్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పట్టణంలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు,లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు,పట్టణ ప్రజలు,మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు,సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి అండగా నిలిచిన బండారి ప్రశాంత్

**జమ్మికుంట, జులై 2, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**



వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన తాత్కాలిక గుడిసెలో నివసిస్తున్న ఓ నిరుపేద వృద్ధురాలి దయనీయ పరిస్థితి గురించి సమాచారం అందిన వెంటనే 3వ వార్డు సభ్యులు బండారి ప్రశాంత్ స్పందించారు. వర్షాకాలంలో గుడిసె పైకప్పు పూర్తిగా దెబ్బతినడంతో వర్షపు నీరు లోపలికి చేరి, వృద్ధురాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఆయన, వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం స్వంత ఖర్చుతో తాడిపత్రిని అందించి గుడిసెకు కొత్త కవరింగ్ ఏర్పాటు చేయించి, వర్షపు నీరు లోపలికి రాకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వృద్ధురాలిని పరామర్శించిన బండారి ప్రశాంత్, అవసరమైన సహాయం ఎప్పుడైనా అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సహాయం అందుకున్న వృద్ధురాలు బండారి ప్రశాంత్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, తన కష్టసమయంలో అండగా నిలిచినందుకు ఆనందం వ్యక్తం చేశారు. “సేవే లక్ష్యం -- ప్రజల సంక్షేమమే ధ్యేయం” అనే నినాదంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న బండారి ప్రశాంత్ సేవా కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు.

# సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

- **రాయితీపై పత్తి,కంది విత్తనాల పంపిణీ.**
- **వేల్పుల పూజ మండల వ్యవసాయ అధికారి.**

**హుస్నాబాద్ జూలై 02 (తెలంగాణ వాణి ఆర్.సి)**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో హుస్నాబాద్ రైతు వేదికలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై కంది, పత్తి విత్తనాలను పంపిణీ చేసింది. మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో ప్రజాప్రతి నిధులు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ మాట్లాడుతూ హుస్నాబాద్ మండల రైతులకు రాయితీపై కంది, పత్తి విత్తనాలు అందుబాటు లో ఉన్నాయని తెలిపారు. కంది విత్తనాల కిలో ధర రూ.130 కాగా, ప్రభుత్వ సబ్సిడీతో రైతులు కేవలం రూ.100 మాత్రమే చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగుకు అనువైన నూజివీడు



సీడ్స్‌కు చెందిన ‘అర్మిత’ రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలంటే ఎకరాకు ఆరు ప్యాకెట్ల విత్తనాలు అవసరమవుతాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలనువినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు. సబ్సిడీ విత్తనాలు కావాలనుకునే రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో సంబంధిత క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈవోలు) సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్న రాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించి మెరుగైన దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వంకృషి చేస్తోంద న్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలను పాటించి పంటల సాగులో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జి. వెంకటశివరాం, కె. విజయ్, రైతులు గుర్రాల సంజీవరెడ్డి, గంగం సుధాకర్ రెడ్డి, ఓరుగంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత**
**జగిత్యాల: జూలై 02 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. గురువారం కొడిమ్యాల మండలం శనివారంపేట గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, వివరాల నమోదు, ఓటర్లకు అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్



ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారాన్ని అందించాలని కోరారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వే--రీ సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారంపేట గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 1923 నిబంధనలు, భూముల రీ-సర్వే విధానం, సర్వే ప్రక్రియపై రైతులు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, భూమి కొలతల ఏడీ కిషన్ ప్రసాద్, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద**
- **ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి**

**జగిత్యాల: జూలై 02 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లి అర్బన్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న హెల్త్ సెంటర్‌తో పాటు కోరుట్ల పట్టణంలోని అల్లమయ్యగుట్ట వద్ద నిర్మిస్తున్న హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన



అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ప్రహరీ, రహదారి వంటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు చేరేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. అనంతరం మెట్‌పల్లి పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు తప్పనిసరిగా నమోదు అయ్యేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ ప్రజలకు సహాయ సహకారాలు కల్పించాలని సూచించారు. నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీఓలు నరసింహారావు, జీవాకర్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) సుజాత, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

**శ్రీ బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం**
**పటాన్‌చెరు, జూలై 2 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను శ్రీ బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరాం విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, పాఠశాల, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రోహిత్ (564), సంగమేశ్వర్ (554),



రాజేశ్వరి (529)లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పీ. రాథోడ్, ఉపాధ్యాయులు సౌభాగ్య, శ్రీనివాస్ గౌడ్, తుకారం, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యం : మహాదేవుని శ్రీనివాస్

**కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పునర్నియామకం**
**కొమురవెల్లి, జూలై 2 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మహాదేవుని శ్రీనివాస్ మరోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్ఠానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి న్యాయం చేస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకిత భావంతో పనిచేస్తానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన పునర్నియామకానికి సహకరించిన జన గామ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంకాక్ష రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు మహాదేవుని శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఏటూరునాగారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా దేవులపల్లి విజయ్ కుమార్

**పార్టీ బలోపేతమే లక్ష్యమని వెల్లడి**
**ఏటూరునాగారం, జూలై 2 (తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శంకరాజుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేవులపల్లి విజయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వం, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, కార్యకర్తలందరినీ



కలుపుకొని మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. దేవులపల్లి విజయ్ కుమార్ నియామకంతో మండల కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం నెలకొన్నదని, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

**ట్రాన్స్ఫార్మర్ తీయలకు తలిగి ఎద్దు మృతి**
**ధర్మారం, జులై 2 (తెలంగాణ వాణి)**



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ కాడెద్దు ప్రమాదవశాత్తు మృతి చెందింది. ధర్మారం మండలంలోని బుచ్చయ్య పల్లి గ్రామ శివారులో పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ తీగలు వదులుగా వేలాడుతున్నాయి. గురువారం మిట్ట చంద్ర య్య చెందిన ఎద్దు మేత కోసం పొలం వద్దకు వెళ్లి ప్రమాద వశాత్తు తీగలకు తగిలి విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని స్థానిక రైతులు గత 4 ఏళ్లుగా విద్యుత్ అధికారులకు పలు మార్లు మౌఖికంగా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు సకాలంలో పట్టించుకోనందునే ఎద్దు మృతి చెందినట్లు రైతు మిట్ట చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్య ధోరణివల్ల ఎద్దు చనిపోయిందని తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు డిమాండ్ చేశారు.

## కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా జాడి రాంబాబు

**కన్నాయిగూడెం, జూలై 2 (తెలంగాణ వాణి)**



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు డిగా జాడి రాంబాబును పార్టీ అధిష్ఠానం నియమించింది. గురువారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జాడి రాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, కార్యకర్తలందరినీ కలుపుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. ఈ



కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎండీ అప్సర్ పాషా, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల తాత్సారం వల్లే పోరాటాలు

**ములుగు,జులై2(తెలంగాణ వాణి):**



ఉప్పల్ భగాయత్ లో తెలంగాణ ఉద్యమకారుల కోసం చేపట్టిన భూ పోరాటం కార్యక్రమంలో టీఆరెస్ అధినేత కల్వకుంట్ల కవితక్కను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ములుగు జిల్లా అధ్యక్షులు మురహరి బిక్షపతి తెలిపారు. ప్రభుత్వం 100 రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని అధికారం లోకి వచ్చి రెండు న్నరేళ్లు గడచినా తాత్సారం చేయడం వల్లనే ఇలాంటి పోరాటాలు జరుగుతాయని ఉద్యమకారుల పోరాటాలతో రాష్ట్రము వస్తే అధికారం చేపట్టి,పదవులు పొంది వారిని విస్మరించి కుర్చీలలో ఎలా కూర్చుంటారని నీలాదీశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించడం వల్లనే అధికారం కోల్పోయిందని ఇప్పటికైనా అన్ని పార్టీలు ఉద్యమకారుల సంక్షేమం కోసం తమ విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ లతో కాకుండా మనసు పెట్టి పరిష్కారం దిశగా అలోచించి కమిటీలో ఒక ఐఏఎస్ అధికారి,ఒక జడ్జిని నియమించి పార దర్శకంగా ప్రక్రియ మొదలు పెట్టాలని,6నెలల్లో ఉద్యమకారులను గుర్తించి వారికిచ్చిన హామీలు అమలుపరచాలని కోరారు.. ఉద్యమకారులను సంక్షేమం కోసం ఎవరు పాటుపడితే ఆ ప్రభుత్వానికి వారు అండగా ఉంటారని తెలిపారు..

## యాదయ్య మృతికి నివాళులర్పించి ఆర్థికసహాయం అందించిన ' దైద '







**నకిరేకల్ : జూలై 2 (తెలంగాణ వాణి)**

నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఆలగడప యాదయ్య అనారోగ్యంతో మృతి చెందగా యాదయ్య మృతదేహానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పూలమాలవేసి నివాళులర్పించి , ఆ నిరుపేద కుటుంబానికి దహణ సంస్కారాల నిమిత్తం 5000/- (ఐదువేల రూపాయలు) ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి , జిల్లా అధ్యక్షుడు యాస కరుణాకర్ రెడ్డి , గ్రామ సర్పంచ్ పొట్టబోతుల జయమ్మ వెంకటేశం , గ్రామ శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి జాన్ రెడ్డి , సామ రవీందర్ రెడ్డి , సామ సత్తిరెడ్డి , కుంచం సోమయ్య , కందాల వెంకటరెడ్డి , చంద్రారెడ్డి , సంతోష్ , మాచర్ల యాదగిరి, రాములు తదితరులు నివాళులర్పించారు.

## టేకులపల్లి నూతన ఎస్ఐ తిరుపతిని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**టేకులపల్లి, జూలై 2 (తెలంగాణ వాణి):**

టేకులపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్ఐ తిరుపతిని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంపై ఎస్ఐతో చర్చించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు వరప్రసాద్ గౌడ్, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, మాజీ ఎంపీటీసీలు జాలాది అప్పారావు, భూక్య బాలకృష్ణ, సర్పంచులు నాకా రామ, జాటోత్ నరేష్ కుమార్, బోడ రమేష్, ముచ్చ జయరాజ్, మాలోతు రాజేందర్, సంతోష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీపీ నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో






**టేకులపల్లి, జూలై 2 (తెలంగాణ వాణి):**

మండలంలోని పలు గ్రామపంచాయతీ నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తడకలపూడి, తావుర్య తండా, కొత్త తండా (పీ), రాంపురం, ప్రగల్లపాడు గ్రామాల్లోని జీపీ నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకం, సంరక్షణ పనులను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కల నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం టేకులపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, రికార్డుల నిర్వహణ, సేవల అమలును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ సిబ్బందికి ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ పోటీలలో పాల్గొనండి

- గీతం విద్యార్థులకు పిలుపు
- జాతీయ స్థాయి పోటీలలో మరోసారి సత్తాచాటాలని సూచన

**పటాన్ చెరు, జూలై 2, (తెలంగాణ వాణీ రిపోర్టర్):**

భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక ఆవిష్కరణల కార్యక్రమమైన ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0లో చురుకుగా పాల్గొనాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తన విద్యార్థులు, అధ్యాపకులను కోరింది. అధ్యాపకులను ఉద్దేశించి గీతం వెంచర్ డెవలప్మెంట్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ ఇంక్యుబేషన్ స్కీమ్ సమన్వయకర్త వికాస్ కుమార్ శ్రీవాస్తవ సూచనలు చేస్తూ, జాతీయ స్థాయి హ్యాకథాన్ కు సమర్పించేందుకు వీలుగా, విద్యార్థుల ఆశాజనకమైన ఆవిష్కరణలు, పరిశోధన ఆలోచనలు, తరగతి గది ప్రాజెక్టులు, ప్రయోగశాల నమూనాలను గుర్తించి, వాటికి మార్గదర్శకత్వం వహించాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0 ఎంపికైన ప్రతి ఆలోచనను ఒక ఫంక్షనల్ ప్రోటోటైప్ గా, ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ గా లేదా వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పత్తిగా అభివృద్ధి చేయడానికి 15 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈలు, సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే ఆచరణాత్మక, విస్తరించదగిన, సాంకేతిక ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు. గీతం గతంలో సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ, ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 5.0 కింద నిధుల కోసం విశ్వవిద్యాలయం నుంచి రెండు ప్రతిపాదనలు ఎంపికయ్యాయని శ్రీవాస్తవ తెలిపారు. కాలిన గాయాలకు పోర్టబుల్ డ్యూయల్-మోడ్ చికిత్సా పరికరమైన ఫ్లెక్సీహీల్ ను అభివృద్ధి చేసినందుకు డాక్టర్ సత్యవ్రత దాష్ కు 10.2 లక్షల రూపాయల ప్రభుత్వ మద్దతు లభించగా, తీరప్రాంత విపత్తుల పర్యవేక్షణ, సుస్థిర మత్స్య పరిశ్రమ కోసం ఏఐ ఆధారిత స్మార్ట్ బాయ్ నెట్ వర్క్ అయిన కోస్ట్-సేఫ్ కోసం చంద్రకాంత మహంతి 11.9 లక్షల రూపాయలు సాధించారన్నారు. ప్రస్తుత ఎడిషన్లో గీతం మరింత గొప్ప విజయాన్ని సాధించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వినూత్న ఆలోచనలు ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఇంక్యుబేషన్, మెంటరింగ్ మద్దతుతో తమ భావనలను నిధులు పొందే ప్రాజెక్టులుగా మార్చుకోవాలని ఆయన ప్రోత్సహించారు. ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0 కోసం జూలై 5 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఎంఎస్ఎంఈ ఇన్నోవేషన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకుని, తమ ప్రతిపాదనలను సమర్పించేటప్పుడు గీతంను హోస్ట్ ఇన్ స్టిట్యూట్ గా ఎంచుకోవాలని సూచించారు. ఈ హ్యాకథాన్ పునరుత్పాదక శక్తి, శక్తి సామర్థ్యం, ఆటోమోటివ్ టెక్నాలజీ, ఇండస్ట్రీ 4.0, 5.0, రోబోటిక్స్, ఆటోమేషన్, ఇంకా ఇతర అత్యాధునిక సాంకేతికతల వంటి రంగాలలో ఆలోచనలను ఆహ్వానిస్తుందన్నారు. ప్రతిపాదిత ఆవిష్కరణలు నూతనంగా, విస్తరించదగినవి గా, సామాజికంగా సంబంధితమైనవి గా ఉండాలని, వాణిజ్య సామర్థ్యంతో పనిచేసే నమూనాలుగా అభివృద్ధి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలని స్పష్టీకరించారు. హ్యాకథాన్ గత సంచికలో సాధించిన అద్భుతమైన పనితీరును కొనసాగిస్తూనే, భారతదేశ ఆవిష్కరణ, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థకు గీతం తన సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు వీలుగా, అర్హులైన విద్యార్థులను, పరిశోధన బృందాలు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించవలసిందిగా అధ్యాపకులను శ్రీవాస్తవ కోరారు.

# బండ్ల గూడలో పర్యటించిన ఎంపీ రఘు నందన్‌రావు

**పటాన్ చెరు, జూలై 2, (తెలంగాణ వాణీ రిపోర్టర్)**





: పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని జేపీ కాలనీ డివిజన్ బండ్ల గూడ కాలనీలో గత 4 నెలల క్రితం రైల్వే లైను కోసం స్థానికంగా ఉన్న ఇళ్లను కూల్చేందుకు రైల్వే అధికారులు రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ఇళ్లకు నెంబర్లు వేయడం జరిగింది, ఈ విషయమై స్థానిక పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ దాదాపు 100 మందితో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ని కలిసి సమస్యను వివరించి స్థానికంగా ఇల్లు ఉన్నవారంతా నిరు పేదలని, వారు తమ రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న ఇల్లు కోల్పోకుండా వారికి న్యాయం చేయాలని కోరడం జరిగింది. సమస్యను విన్న రఘునందన్ రావు తప్పకుండా వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది. తన బిజీ షెడ్యూల్ వల్ల రాలేక పోయినప్పటికీ ఈ రోజు ఎంపీ రఘునందన రావు ప్రత్యేకంగా సమయానికి కేటాయించి, స్థానిక మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తో కలిసి బండ్లగూడ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు నూతన రైల్వే ట్రాక్ వేస్తున్న స్థలాన్ని, రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదల ఇల్లు కోల్పోకుండా రైల్వే అధికారులతో మాట్లాడి వారికి సముచిత న్యాయం తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ, మెదక్ ఎంపీగా క్షణం తీరికలేని బిజీ షెడ్యూల్లో ఉన్నప్పటికీ తన విన్నపాన్ని స్వీకరించి ఈ రోజు విచ్చేసి బండ్ల గూడలో రైల్వే ట్రాక్ కొరకు నిరుపేదలు ఇల్లు కోల్పోకుండా తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం చాలా సంతోషకరమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బండ్ల గూడ బి ఆర్ ఎస్ టౌన్ ప్రెసిడెంట్ భరత్, బి జె పి నాయకులు రాజశేఖర్ రెడ్డి,కుమార్, మురళీధర్ వర్మ,గొల్ల కృష్ణ, అడ్వకేట్ విజయ్ రాజ్, లక్ష్మణ్ యాదవ్, సురేష్ రెడ్డి, గోపాల్, శ్రీశైలం, బిక్షపతి, చంద్రశేఖర్, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# కాటారం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన..

**కాటారం జులై 2 తెలంగాణ వాణి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం కాటారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలను, విద్యా సంస్థలను తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, సంక్షేమ పథకాల అమలు, రైతులకు అందుతున్న సేవలు, రెవెన్యూ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

అంగన్వాడి కేంద్రంలో బాలామృతం పంపిణీ. ముందుగా కాటారం మండలం అంకుశాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్యం, పోషణ, విద్యా పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. బాలింతలకు, చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం సక్రమంగా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

**పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ**

అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాల ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

**పీఏసీఎస్ కేంద్రంలో రైతులతో ముఖాముఖి:**

తదుపరి కాటారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, యూరియా బుకింగ్ వివరాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ నిర్వహణపై వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ సీఈఓను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి యూరియా బుకింగ్ ప్రక్రియ సక్రమంగా సాగుతోందా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమైన కలెక్టర్ కాటారం సబ్ డివిజన్ పరిధిలోని బల్క్ ల్యాండ్ సమస్యలు, సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవీందర్, వ్యవసాయ అధికారి బాబురావు, మహిళా, శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి, సీడీపీఓ రాధిక, తహసీల్దార్ నాగరాజ్, ఎంపీడీవో బాబు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా తీర్చిదిద్దే దిశగా బోడు జడ్పీహెచ్ఎస్‌పై అధికారుల ప్రత్యేక దృష్టి

**డీఈవో వాసంతి, ఆర్జేడీ మదన్ మోహన్ ఆకస్మిక తనిఖీ**

**టేకులపల్లి, జూలై 2 (తెలంగాణ వాణి):**



భవిష్యత్తులో తెలంగాణ పబ్లిక్ స్కూల్' గా రూపాంతరం చెందనున్న టేకులపల్లి మండలంలోని బోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) వాసంతి, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) మదన్ మోహన్ గురువారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డీఈవో వాసంతి తరగతి గదులను సందర్శించి బోధనా విధానాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని అంచనా వేశారు. బోధనను మరింత నాణ్యంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు, చదువులో ప్రతిభ



కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ఆర్జేడీ మదన్ మోహన్ పాఠశాలలోని మౌలిక వసతులు, ప్రయోగశాలలు, అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించి, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మీర జగన్, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల అభివృద్ధిలో గ్రామస్థుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల సమిష్టి కృషితో పాఠశాలను ఆదర్శవంతమైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

## హరీష్ రావు అరెస్టును ఖండించిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లావుడ్యా సత్యనారాయణ నాయక్

**సుజాతనగర్, జూలై 2 (తెలంగాణ వాణి)**



బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అరెస్టును సుజాతనగర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లావుడ్యా సత్యనారాయణ నాయక్ తీవ్రంగా ఖండించారు.గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నప్పటికీ, చివరి నిమిషంలో వేదిక మార్చి అనంతరం హరీష్ రావును పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. విద్యాశాఖలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ప్రభుత్వ లెక్కలు సక్రమంగా ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై పోలీసులను ప్రయోగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని లావుడ్యా సత్యనారాయణ నాయక్ డిమాండ్ చేశారు.



## నూతన గృహప్రవేశం జీవితంలో మధురమైన ఘట్టం

**వనపర్తి , జులై 2, (తెలంగాణ వాణీ ప్రతినిధి)**

వనపర్తి జాగృతి కాలేజీ ప్రిన్సిపాల్ వినోద్ నూతన గృహప్రవేశానికి హాజరైన ఏఐపిసి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన గృహంలో ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. నూతన గృహప్రవేశం ప్రతి ఒక్కరి జీవితంలో మధురమైన, ఎంతో ఆనందకరమైన ఘట్టం. కొత్త ఇంట్లోకి అడుగుపెట్టే ఈ పవిత్రమైన సమయంలో, వాస్తు నియమాలను పాటించడం పూజా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఆనందం, శాంతి, శ్రేయస్సు వెల్లివిరుస్తాయి అన్నారు.ఈ కార్యక్రమంలో ఎం దేవన్న యాదవ్, నాగార్జున,శివ తదితరులు పాల్గొన్నారు.

## మత్తమాల ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



**ఎల్లారెడ్డి జులై 02 తెలంగాణ వాణి ప్రతినిధి**
ఎల్లారెడ్డి మండలం మత్తమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అనంతరం పాఠశాలలో మొక్కలను నాటారు. మరియు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ , ఎల్లారెడ్డి రెవిన్యూ డివిజన్ అధికారి మరియు జిల్లా అధికారులు మండల అధికారులు పాల్గొనడం జరిగింది.

## 13వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

- పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధే మా లక్ష్యం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సారధ్యంలో వేములవాడ పట్టణ అభివృద్ధి
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ,జూలై 02 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శరవేగంగా జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన ఆయన, ఇంజినీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.?ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.4 కోట్ల 20 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతోనే ప్రస్తుతం పట్టణంలో డ్రైనేజీ పనులు, సిసి రోడ్ల పనులు చేపడుతున్నట్లు వివరించారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా వేములవాడను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ?ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీఓ అన్వేష్, నాయకులు సాయిని అంజయ్య, మూడపెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పల్లీల్లో పేడ పురుగు కలకలం....

### జిల్లాలో వరుస ఆహార కలుషిత ఘటనలతో ప్రజల్లో ఆందోళన



**రాజన్న సిరిసిల్ల,జూలై 02 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్స్ పర్మిట్ రూమ్‌లో విక్రయించిన పల్లీల్లో పేడ పురుగు కనిపించడం కలకలం రేపింది. పల్లీలు కొనుగోలు చేసిన ఓ కస్టమర్ వాటిని తింటుండగా పేడ పురుగు కనిపించడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు.దీంతో సంబంధిత యజమానులను కస్టమర్ నిలదీయగా, వారు సరైన వివరణ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇటీవల జిల్లాలో ఆహార భద్రతకు సంబంధించిన ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. మొన్న పానీపూరి తిని పలువురు చిన్నారులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా, నిన్న ఖారలో బల్లి కనిపించడం సంచలనం సృష్టించింది. తాజాగా పల్లీల్లో పేడ పురుగు బయటపడటంతో ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది.వరుసగా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నప్పటికీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నాసిరకం ఆహార పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జాగృతి కళాశాల కరస్పాండెంట్ వినోద్ గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, జూలై 2 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి పట్టణంలోని జాగృతి కళాశాల కరస్పాండెంట్ వినోద్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ స్వామి వ్రత తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వినోద్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియ



జేస్తూ, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఒక కలఅని, ఆ కలను సాకారం చేసుకోవడం అదృష్టమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ స్థాయికి తగిన విధంగా సొంత ఇంటిని నిర్మించు కోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవుల పట్ల కరుణ చూపండి

- శాఖాహారం, అహింసపై ప్రజల్లో చైతన్యం
- వేములవాడలో ఘనంగా జాతీయ అహింసా

ధ్యాన మహాసభల ప్రచార ర్యాలీ

**వేములవాడ,జూలై 02 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ మరియు నేషనల్ వెజిటేరియన్ మూవ్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుండి 5 వరకు హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న జాతీయ అహింసా ధ్యాన మహాసభల పోస్టర్ ఆవిష్కరణ, ప్రచార కార్యక్రమం వేములవాడ పట్టణంలో గురువారం ఘనంగా జరిగింది. లోక కల్యాణంలో భాగంగా ప్రపంచ శాఖాహార, అహింసా దినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించనున్న ఈ మహాసభల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేం




దుకు పట్టణంలో వాహనాలతో భారీ ప్రచార ర్యాలీని నిర్వహించారు. ముఖ్య రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీలో నిర్వాహకులు, ధ్యాన నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజలను చైతన్యపరిచారు.?ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ధ్యానంతోనే విశ్వశాంతి, అహింసతోనే మానవ ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాఖాహారాన్ని స్వీకరించి, మూగజీవుల పట్ల కరుణ చూపాలని కోరారు. శ్వాస మీద ధ్యాస ఉంచుతూ నిత్యం ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని, జన్మ సార్థకమవుతుందని వివరించారు. అక్టోబర్‌లో జరిగే ఈ మహాసభల్లో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో పాటు ప్రతిరోజూ 5 గంటల పాటు సామూహిక సంగీత నాద ధ్యానం, ప్రముఖ ఆధ్యాత్మిక, సినీ, రాజకీయ ప్రముఖుల సందేశాలు మరియు స్పిరిచువల్ బుక్ ఫెయిర్ ఉంటాయని తెలిపారు. ఈ ధ్యాన మహాసభలను విజయవంతం చేసేందుకు వేములవాడ పరిసర ప్రాంతాల ప్రజలు, ధ్యానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు

# అక్కినాపురం తండా సమీపంలో చిరుత సంచార అనుమానం

- కాలి ముద్రలు, చెట్టు ఎక్కిన ఆనవాళ్లు గుర్తించిన అటవీశాఖ
- అప్రమత్తంగా ఉండాలని సూచన

**ఎన్కూర్, జూలై 2 (తెలంగాణ వాణి):**
ఎన్కూర్ మండలంలోని వినోబానగర్ బీట్ పరిధిలోని అక్కినాపురం తండా గ్రామ శివారులో చిరుతపులి సంచరించినట్లు అనుమానాలు వ్యక్తమవడంతో గ్రామస్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గురువారం ఉదయం ఓ రైతు తన వ్యవసాయ పొలానికి వెళ్లగా పెద్ద జంతువుకు చెందిన కాలి ముద్రలు కనిపించాయి. వెంటనే గ్రామస్థులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జూలూరుపాడు రేంజ్ ఎఫ్ఆర్‌వో తేజస్వి ఆదేశాల మేరకు వినోబానగర్ బీట్ అధికారి బి. బాలాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పొలంలో కాలి ముద్రలతో పాటు సమీపంలోని చెట్టుపై జంతువు ఎక్కిన ఆనవాళ్లను గుర్తించారు. ప్రాథమికంగా ఇవి చిరుత సంచారానికి సంబంధించినవిగా భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు



భయపడాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో అడవి సమీపంలోని పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని, చిన్నారులు, పశువుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పరిసర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని



ఎఫ్ఆర్‌వో తేజస్వి తెలిపారు. చిరుత కనిపించినా లేదా అనుమానాస్పద ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీశాఖకు సమాచారం అందించాలని, వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో గ్రామ పెద్ద ధరావత్ బాబు, మాజీ సర్పంచ్ గుగులోతు ప్రసాద్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# కుర్నవల్లి హైస్కూల్‌లో ఘనంగా పల్లె ప్రగతి

### మొక్కలు నాటిన సర్పంచ్, ఉప సర్పంచ్

**తల్లాడ,జూలై (తెలంగాణ వాణి)**
గ్రామ పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా స్థానిక కుర్నవల్లి ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో గురువారం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్ట్ అధికారి ప్రత్యేక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలను నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చని వాతావరణాన్ని అందించడమే పల్లె ప్రగతి ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఫారెస్ట్ అధికారి మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలు పచ్చదనంతో నిండి ఉంటే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం



లభిస్తుందని, విద్యార్థులు కూడా మొక్కల పెంపకాన్ని ఒక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు రకాల నీడను, పూలను ఇచ్చే మొక్కలను నాటారు.



## బీసీ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

**ముఖ్య అతిథిగా పాల్గొన్న అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు**

**వనపర్తి : జులై 2, (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జులై 5వ తేదీ ఆదివారం రోజున భువనగిరిలో టీఅర్పి తలపెట్టిన సభకు హాజరు కావాలని టీఅర్పి జిల్లా అధ్యక్షునీ ఆధ్వర్యంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు ముఖ్య అతిథిగా పాల్గొనీ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ భవనం ముందు పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా డా" సతీష్ యాదవ్ మాట్లాడుతూ టిఆర్పి రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ప్రత్యేక ఆహ్వానం మేరకు అఖిలపక్ష ఐక్యవేదిక గురువారం ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరుగుతుందని. ఐదవ తేదీ భువనగిరిలో జరిగే బహిరంగ సభకు అన్ని బీసీ సంఘాలు హాజరు కావాలని, భవిష్యత్తులో ఏ బీసీ సంఘం సభలు ఏర్పాటు చేసినా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, మనం నూరు కులాలకు పైగా ఉన్నా మనలో అనైక్యత దెబ్బతిస్తుందని దానివల్ల మనం నష్టపోతున్నామని భవిష్యత్తులో అన్ని కులాలు కలిసి, అన్ని సంఘాలు కలిసి ఒకే గూడు కిందకు రావాలని దానికి నేను వ్యక్తిగతంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు డా" సతీష్ యాదవ్, టీఅర్పి జిల్లా అధ్యక్షులు విజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి,పూజారి స్వామి, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, చీర్ల కృష్ణ, రాజనగరం రామస్వామి, సూర్య నాయక్, టిఆర్పి ఉపాధ్యక్షులు బాలరాజు, సత్యం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు తీరును పరిశీలించిన ఎమ్మెల్యే

**ఇల్లంతకుంట:జులై 02 (తెలంగాణ వాణి విలేకరి)**
ఇల్లంతకుంట మండలం ముస్కాన్ పేట గ్రామంలో సర్ ఓటరు నమోదు ప్రక్రియను మానకొండూర్ శాసనసభ్య డు,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ పరిశీలించారు. గురువారం గ్రామాన్ని సందర్శించినప్పుడు సర్ నమోదు తీరును పరిశీలించ డమే కాకుండా ఈ సందర్భం గా ఎదురవుతున్న సమస్యల గురించి ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి,పార్టీ నాయకులు వూట్కూరి వెంకట రమణారెడ్డి,గుడిసె అయిలయ్య,ఐరెడ్డి మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## అధ్వానంగా మారిన మోతిఘణపూర్ గ్రామ క్రీడా ప్రాంగణం

**పట్టించుకోవాలని యువత విజ్ఞప్తి**

**బాలానగర్, జూలై 2 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
బాలానగర్ మండలంలోని మోతిఘణపూర్ గ్రామ శివారులో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రామ క్రీడా ప్రాంగణం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైంది. గ్రామానికి దూరంగా ఉన్న ఈ ప్రాంగణంలో నిర్వహణ లేకపోవడంతో కలుపు మొక్కలు, పొదలు పెరిగి ఆటలకు అనువుగా లేకుండా మారింది.ప్రాంగణం చుట్టూ నాటిన మొక్కలకు నీరందించకపోవడంతో అవి కూడా ఎండిపోతున్నాయని స్థానికులు తెలిపారు. క్రీడా ప్రాంగణం నిర్వహణపై గ్రామపంచాయతీ అధికారులు దృష్టి సారించడం లేదని గ్రామ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యువతకు క్రీడలకు అనుకూలంగా ఉండేలా ప్రాంగణాన్ని శుభ్రపరిచి, అవసరమైన



సౌకర్యాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ యువకులు అధికారులను కోరుతున్నారు.

## చిలుకూరు పీఏసీఎస్‌ను సందర్శించిన జిల్లా సహకార అధికారి కె. శ్రీరామ్



**చిలుకూరు, జూలై 2 (తెలంగాణ వాణి జిల్లా బ్యూరో)**
సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ను జిల్లా సహకార అధికారి కె. శ్రీరామ్ గురువారం సందర్శించారు.
ఈ సందర్భంగా సంఘం రికార్డులను పరిశీలించిన ఆయన నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు యూరియా ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ఆన్‌లైన్ బుకింగ్ వివరాలను తెలియజేయాలని సిబ్బందికి సూచించారు.
చిలుకూరు పీఏసీఎస్ ఎఫ్‌పీఓగా ఎంపికైనందున 300 మంది సభ్యులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.6 లక్షల ఈక్విటీ గ్రాంట్ సంఘం ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. మిగిలిన రైతులు కూడా ఎఫ్‌పీఓ సభ్యత్వం పొందితే ప్రభుత్వ సబ్సిడీ పథకాల ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. అలాగే సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ అధికారి రాజు, సంఘం చైర్మన్ అలసగాని జనార్ధన్, ఉపాధ్యక్షురాలు పద్మావతి, సీఈవో సీహెచ్. లక్ష్మీనారాయణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఓటీ వలలో గంజాయి స్మగ్లర్లు 34.5 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



**పటాన్‌చెరు, జూలై 2 (తెలంగాణ వాణి రిపోర్టర్):**
అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ సుల్తాన్‌పూర్ ఎగ్జిట్-4 వద్ద ఎస్ఓటీ అధికారులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 34.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనుమా నాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 17 ప్యాకెట్లలో మొత్తం 34.5 కిలోల ఎండిన గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.17 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కేసులో సుఖ్‌దేవ్, సుమిత్, బాబుల్ మండల్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా, ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు వెల్లడైంది. ఇద్దరిని రిమాండ్‌కు తరలించగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఎస్ఓటీ, పోలీసు అధికారులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు.



# కాగితం పడవలు బృందానికి చిరు అభినందనలు



కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ, కాలక్రమేణా ఒక చిత్ర నిర్మాతగా మారిన మెగా అభిమాని అంజనప్ప , 45 మంది తన స్నేహితులు, 'కాగితం పడవలు' చిత్రబృందంతో కలిసి చిరంజీవి పై ఉన్న అభిమానంతో, వందల కిలోమీటర్లు ప్రయాణించి మరీ హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు. 'రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి' అని మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన పిలుపును గుండెల్లో నింపుకుని, లక్షలాది మంది ప్రాణాలను కాపాడటంలో మెగాభిమానులు ఎప్పుడూ ముందుంటారని మరోసారి వారంతా నిరూపించారు. ఈ విషయం చిరంజీవి వరకు చేరడంతో ఆయన చాలా హ్యాపీగా ఫీలయ్యారు. విశేషం ఏంటంటే.. అంజనప్ప ఇంతవరకు చిరంజీవిని నేరుగా కలవలేదు. కేవలం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి తన బాధ్యతగా తన చిత్ర బృందంతో కలిసి రక్తదానం చేసి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి.. సినిమా షూటింగ్, ఇతర సామాజిక కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ.. అంజనప్ప అండ్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ స్వయంగా ఒక లెటర్ పంపించారు. ప్రియమైన అంజనప్ప, గాయత్రమ్మ.. ఇంకా 'కాగితం పడవలు' చిత్రయూనిట్ సభ్యులకు.. మానవత్వాన్ని పరిమళింపజేస్తూ, సమాజం పట్ల మీ బాధ్యతను చాటుతూ మీరు చేపట్టిన రక్తదాన సేవా కార్యక్రమానికి నా హృదయపూర్వక అభినందనలు. ఈరోజు చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో 'కాగితం పడవలు' చిత్రయూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మొత్తం 23 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. వైద్య కారణాల వల్ల రక్తదానం చేయలేకపోయిన వారు, ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో రావడం కూడా ప్రశంసనీయం.

# కత్రినా కైఫ్ ప్రస్థానం

బాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన కత్రినా కైఫ్ తన ప్రతిభతో సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చదువు కంటే నటనపై ఆసక్తి పెంచుకున్న ఆమె, కష్టపడి స్టార్ హీరోయిన్‌గా ఎదిగి కోట్లాది మంది అభిమానులను సంపాదించారు. ప్రస్తుతం అత్యధిక పారితోషికం అందుకునే నటీమణుల్లో ఆమె ఒకరిగా నిలిచారు. తెలుగు ప్రేక్షకులకు కూడా కత్రినా కైఫ్ సుపరిచితమే. వెంకటేష్ కథానాయకుడిగా నటించిన 'మల్లీశ్వరి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. అనంతరం బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రంలో నటించారు. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో తిరిగి బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగిన కత్రినా, ప్రముఖ హీరో విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. వివాహం అనంతరం కూడా ఎంపిక చేసిన చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను పదో తరగతి పూర్తి చేయలేదని కత్రినా వెల్లడించారు. అయినప్పటికీ తన ప్రతిభతో ఒక్కో చిత్రానికి సుమారు రూ.25 కోట్ల వరకు పారితోషికం అందుకునే స్థాయికి చేరుకున్నారు. ఆమె ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగానే ఉంటుందని సినీ వర్గాల అంచనా. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

# ఆల్ఫా సెన్సార్ పూర్తి.. 3న విడుదల



శివ్ రావైల్ దర్శకత్వంలో, అలియా భట్, శర్వరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలో కొన్ని మార్పులు చేయాలని కోరింది. ద్వితీయార్ధంలో వచ్చే కొన్ని సన్నివేశాల తీవ్రతను తగ్గించి, ప్రత్యామ్నాయ దృశ్యాలను పెట్టాలని సూచించింది. ప్రథమార్ధంలోని ఓ డైలాగ్‌ను తొలగించి, మరో రెండు సంఘటనల విజువల్స్‌ను తగ్గించాలని ఆదేశించింది. మద్యం తీసుకునే సన్నివేశాల్లో గమనిక వేయాలని, మూవీలోని అన్ని పాటలకూ సబ్‌టైటిల్స్ జోడించాలని కోరింది. సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ కోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి లేఖను సమర్పించాలని ఆదేశించింది. తాజాగా ఆల్ఫా ఈ పనులన్నీ పూర్తి చేసుకుంది. ఈ భారీ యాక్షన్ సినిమా నిడివి 2 గంటల 20 నిమిషాల 48 సెకన్లు. ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ మూవీలో బాబీ దియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తుండగా, హృతిక్ రోషన్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.



# యషికా ఆనంద్ సినీ ప్రయాణం

తమిళ సినీ పరిశ్రమలో గ్లామరస్ పాత్రలు, ప్రత్యేకమైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి యషికా ఆనంద్ సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, తక్కువ సమయంలోనే కథానాయికగా ఎదిగి తమిళ ప్రేక్షకుల్లో మంచి ఆదరణను సంపాదించారు. సినిమాలతో పాటు రియాలిటీ షోల ద్వారా కూడా ఆమెకు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. 1999 ఆగస్టు 4న న్యూఢిల్లీలో జన్మించిన యషికా ఆనంద్ అనంతరం చెన్నైలో స్థిరపడ్డారు. 2016లో విడుదలైన 'ధురువంగల్ పత్తినారు' చిత్రంతో సినీరంగంలో అడుగుపెట్టిన ఆమె, సహాయ పాత్రలో నటించినప్పటికీ తన నటనతో గుర్తింపు పొందారు. 2018లో విడుదలైన 'ఇరుట్టు అరైయిల్ మురట్టు కుత్తు' చిత్రంలో పోషించిన పాత్రతో యషికా ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అదే ఏడాది ప్రసారమైన 'బిగ్‌బాస్ తమిళం - రెండో సీజన్'లో పాల్గొని మరింత ప్రజాదరణను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఆమెకు అభిమానులను మరింత పెంచింది.తర్వాత 'జాంబీ', 'సిల నొడిగలిల్', 'వెపన్', 'డీడీ నెక్స్ట్ లెవల్' వంటి చిత్రాల్లో నటించిన యషికా ప్రస్తుతం 'టీఎన్ 2026', 'రాజభీమ', 'కలెక్టర్', 'టాస్' తదితర చిత్రాలతో బిజీగా ఉన్నారు. మోడల్‌గా ప్రారంభమైన ఆమె ప్రస్థానం ప్రస్తుతం దక్షిణ భారత చిత్రసీమలో గుర్తింపు పొందిన నటిగా కొనసాగుతోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ యువతలో మంచి ఆదరణను పొందుతున్నారు.

# టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై-బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఇప్పటివరకు యష్ లుక్స్, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక్ విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ్' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక్'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com